తాగు నీరు వృథా



తారు నీరు వృథాగా పోతుంది. సోమవారం మండలంలోని ధర్మాసాగర్‌పల్లిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు నేల పాలవుతుంది. తరచూ ఎక్కడో ఒక చోట పైపు లైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. తక్షణమే స్పందించి లీకేజీలను నివారించాలని కోరుతున్నారు. – కోహెడరూరల్(హుస్నాబాద్)

చేతికందే ఎత్తులో ప్రమాదం



చిన్నకోడూరులో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు

చేతికందే ఎత్తులో ప్రమాదం పొంచి ఉంది. ఆదమరిస్తే ఇక అంతే సంగతులు. విషయానికొస్తే.. చిన్నకోడూరు శివారులో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్నడం.. నారుమళ్లు పోసే పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో అనుకోని ఘటనలు జరగక ముందే అధికారులు మేల్కొవాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఇప్పటికైనా లూజైన వైర్లు సరిచేయాలని కోరుతున్నారు. – చిన్నకోడూరు (సిద్దిపేట)

ఎంపీటీసీల డుమ్మా



స్థానిక మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం జరగాల్సి ఉంది. ఎంపీపీ గజ్జల సాయిలును మినహాయిస్తే, మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని 10 మంది ఎంపీటీసీల్లో ఏ ఒక్కరు కూడా మధ్యాహ్నం 12 గంటలు దాటినా హాజరు కాలేదు. సమావేశానికి అధికారులు తప్ప ఎంపీటీసీలు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కోరం లేకపోవడంతో మండల సర్వ సభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ గణేష్‌రెడ్డి ప్రకటించారు. – మిరుదొడ్డి(దుబ్బాక)

క్లుప్తంగా

అంగన్‌వాడీలకు ఫ్యాన్ల వితరణ



అంగన్‌వాడీలకు ఫ్యాన్లు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ వెంకట్‌గౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్లాగౌడ్ ట్రస్ట్ చైర్మన్ రంగా వెంకట్‌గౌడ్ నాలుగు ఫ్యాన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన తండ్రి జ్ఞాపకార్థంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి గ్రామంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లలకు ఫ్యాన్లు లేక ఉక్కపోత ఉంటుందని టీచర్లు తమ దృష్టికి తీసుకురావడంతో అందజేశామన్నారు. కార్యక్రమంలో సభ్యులు గిరిధర్‌రావు, దామోదర్‌రెడ్డి, వెంకటేశం, చంద్రశేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, కరుణకర్, సత్యం, నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



అలీని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీని పీఆర్టీయూ జిల్లా శాఖ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ ఉపాధ్యాయ బృందం సభ్యులు సన్మానించారు. సోమవారం ఆయన ఇందిరానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా సత్కరించి అభిమానాన్ని చాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, నీరజ, రామకృష్ణారెడ్డి, దశరథం, వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ఏర్పాటు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని సమీకృత మార్కెట్ కార్యాలయం వద్ద హైమాస్ట్ లైట్‌ను బీజేపీ మండల నాయకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంటేశం మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ముందు మండలవ్యాప్తంగా 13 హైమాస్ట్ లైట్లు ఎంపీ సంజయ్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటి ఏర్పాటులో జాప్యమైందన్నారు. ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుధీర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రమేశ్, వేణు, శ్రీనివాస్, సాగర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ ఎంపీకి సత్కారం



ఎంపీ మల్లు రవిని సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న శ్రీకాంత్

దుబ్బాక: నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిని సోమవారం మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ మున్సిపల్ యూత్ అధ్యక్షుడు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన్ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తునికి సురేశ్, మున్సిపల్ యూత్ ఉపాధ్యక్షుడు కడవేర్గు గోపీ ఉన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

బడిబాటలో ఉపాధ్యాయులు



తొగుట(దుబ్బాక): చందాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మిరుదొడ్డి(దుబ్బాక): చెప్యాలలో తల్లిదండ్రులకు బడిబాట కరపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెప్యాల ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం వారు, విద్యార్థులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు కరపత్రాలు అందజేసి, అవగాహన కలిగించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టారెడ్డి, టీచర్లు చంద్రశేఖర్, మల్లేశం, లోకేశ్, వీఓ లీడర్లు లక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుశీల పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతుందని ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని చందాపూర్‌లో సోమవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఉదయం రాగిజావతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులకు సూచించారు.

సమయ పాలనేదీ?

దరఖాస్తుదారులు, విద్యార్థుల ఆందోళన



ఆన్‌లైన్ రశీదులను చూపుతున్న దరఖాస్తుదారులు, విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): సమయ పాలన పాటించని రెవెన్యూ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మీసేవా ఆన్‌లైన్ రశీదులతో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉదయం 11.30 గంటలు దాటినా కార్యాలయంలో అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబీసీ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసి నెల రోజులు గడుస్తున్నా నేటికీ కూడా అందజేయలేదని మండిపడ్డారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం వారం రోజుల క్రితం దరఖాస్తులు ఇచ్చినా ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదు లేదని వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి సమయ పాలన పాటించాలని, ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు పత్రాలను అందిస్తామన్నారు.

15 రోజులకు ఎల్‌సీ ఇవ్వరూ..



విద్యుత్ శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): 15 రోజుల పాటు పట్టణ కేంద్రం పరిధిలో రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) ఇవ్వాలని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. సోమవారం విద్యుత్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అడ్డున్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తామన్నారు. కొత్తవి వేయడానికి 15 రోజుల పాటు ఎల్‌సీ ఇవ్వాలని కోరారు. వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీష్‌గౌడ్ ఉన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న జీపీ (గ్రామ పంచాయతీ) కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించే పారిశుద్ధ్య కార్మికుల పట్ల చిన్నచూపు తగదన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఐదారు నెలలుగా వేతనాలు అందక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

మంత్రి తుమ్మలను కలిసిన నేతలు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తదితరులు

కొండపాక(గజ్వేల్): మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును సోమవారం హైదారాబాద్‌లో తొలిసారిగా కొండపాకకు చెందిన డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వపరంగా రైతులకు మేలు జరిగేలా పథకాలు అమలయ్యేలా చూడాలని కోరారు. కాగా, కాంగ్రెస్ బలో పేతం కోసం కృషి చేయాలని మంత్రి ఆయన్ను సూచించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ 1997–98కి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం జరుపుకొన్నా రు. 25 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కసిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, రమేశ్ మాట్లాడుతూ బతుకుదెరువు, ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిర పడిపోయిన వారందరూ మళ్లీ ఒక చోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాగా, నాటి ఉపాధ్యాయులు నాగేందర్, మల్లేశం, సంజీవరెడ్డి, జహీర్‌ఖాన్, పద్మశ్రీలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

చేర్యాల(సిద్దిపేట): బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రమణ అన్నారు. ఆ కార్మిక సంఘం సోషల్ మీడియా రాష్ట్ర కోకన్వీనర్ మెరిండ్ల శ్రీనివాస్‌గౌడ్(43) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం రాత్రి మృతిచెందగా సోమవారం మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి వచ్చి శ్రీనివాస్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట శోభన్, కొమురయ్య, బండకింది అరుణ్, వెంకటమల్లయ్య, వెంకటనర్సయ్య, సుధాకర్, రవీందర్, రాజేశ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని హనుమాన్‌నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ముర్షద్‌గడ్డ, సాయివిద్యానగర్, గణేష్‌నగర్, హనుమాన్‌నగర్, శ్రీసాయినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వర్గల్(గజ్వేల్): విద్యుత్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంతోశ్ కుమార్ తెలిపారు. మక్త మైలారం, చౌదరిపల్లి, సీతారాంపల్లి, బొర్రగూడెం, చందాపూర్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తామని, దీంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మారుతీ తెలిపారు. ఉదయం 6 నుంచి 8.45 గంటల వరకు తూప్రాన్ రోడ్డు, తిరుమల థియేటర్, సంగాపూర్ రోడ్డు ప్రాంతాల్లో, ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు చేగుంట రోడ్డు, సంగుపల్లి, తూప్రాన్ రోడ్డు ఏరియాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

13న తైబజారు వేలం పాట

జగదేవ్‌పూర్(గజ్వేల్): మేజర్ గ్రామ పంచాయతీ జగదేవ్‌పూర్ తైబజారు వేలం పాట ఈ నెల 13న నిర్వహించనున్నట్లు కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. పశువుల సంత, కూరగాయల మార్కెట్‌కు వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 10 వేలు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం పది గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వైద్యశిబిరానికి స్పందన

తొగుట(దుబ్బాక): తొగుటలో సురభి మెడికల్ కళాశాల, గుడికందులలో ఆశ్రయం, హోప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. వారిని శుక్రవారం కాలేజీ బస్‌లో ఎక్కించుకొని ఆపరేషన్ చేయించి ఇళ్ల వద్ద దింపుతామని పీఆర్వో మరుశరాములు తెలిపారు. గుడికందులలోనూ 250 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, తొగుట, గుడికందుల మాజీ సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, మల్లయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ భైరవగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

మర్కూక్(గజ్వేల్): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు అన్నారు. సోమవారం ఎర్రవల్లి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్, మర్కూక్ మండలాల క్రికెట్ లీగ్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడల వల్ల పరిచయాలు పెరుగుతాయన్నారు. అలాగే శరీర ధృడత్వానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ చెన్‌రాజు, సభ్యులు కరుణకర్, ప్రభాకర్, పరశురామ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ హైనా దాడిలో దూడకు గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ గాయపడిన సంఘటన మండల పరిధిలోని మెట్పల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రైతు దర్మాజీపేట సత్తిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద రోజూ మాదిరిగా పశువుల కొట్టంలో కట్టేసి ఇంటికొచ్చాడు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా దూడ గాయపడి ఉంది. దీంతో వెటర్నరీ వైద్యుడితో చికిత్సలు చేయించాడు. హైనా దాడి చేసినట్లు ఆయన నిర్ధారించారు.

◆ డీపీఓకు ఫిర్యాదు

చిన్నకోడూరు(సిద్దిపేట): తనపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని ఎల్లాయపల్లి వాసి ఉడుత ఎల్లయ్య కోరారు. సోమవారం డీపీఓ కార్యాలయం అధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో అక్రమాలపై ప్రశ్నిస్తే తనపై అక్రమంగా కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. గ్రామంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

◆ విద్యార్థికి సన్మానం



బెజ్జంకి(సిద్దిపేట): నీట్‌లో ప్రతిభ చూపిన పాపన్నపల్లెకు చెందిన దోనె శరత్‌చంద్రను సోమవారం బీఆర్‌ఎస్ నేతలు సన్మానించారు.కార్యక్రమంలో నాయకులు లింగాల లక్ష్మణ్, మల్లేశం, రమేశ్, పెద్దన్న, ప్రభాకర్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మ జాతరకు పోటెత్తిన భక్త జనం

పోటెత్తిన భక్తజనం

దుబ్బాక మండలం శేరిపల్లి బందారంలో ర్యాగటమ్మ జాతర రెండో రోజైన సోమవారం భక్తులు పోటెత్తారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – దుబ్బాకటౌన్



పట్టుబడిన ట్రాక్టర్‌లు

ఐదు ట్రాక్టర్ల పట్టివేత

చిన్నకోడూరు(సిద్దిపేట): మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను, జేసీబీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో కొంతమంది మట్టి అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు దాడులు చేసి ఐదు ట్రాక్టర్‌లు, జేసీబీని పట్టుకున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.